# పంతాలు-పట్టింపులు

ఎ. వి. సుబ్బారావు

ఆఫీసు గడియారం ఐదుగంటలు కొట్టింది. ఉన్నట్టుండి ఏదో గుర్తొచ్చి గట్టిగా బెల్‌కొట్టారు. డి. యం. పరాంకుశంగారు.

'సార్' అంటూ స్ప్రింగ్‌డోర్ తెరుచుకొని లోపల ప్రవేశించాడు అటెండరు అప్పలస్వామి. తలపై టోపీ సర్దుకుని.

'చూడు – ఆ ఏ – 2 కామేశ్వర్రావు నిలా పిలు'.

'అయ్!' అంటూ అప్పలస్వామి నాసీటు దగ్గరగా వచ్చి చెవులో వూదాడు 'తమర్ని ఐగారు పిలుసున్నారండయ్యా' అని.

బహుశ! ఇందాకా వుటప్ చేసిన బిల్లుల గురించి 'ఆశీర్వదించడానికే పిలిచి వుంటాడనుకుంటూ – కాస్తంత చిరాగ్గాను – మరింత భయంగాను డి. యం. గారి రూంలో అడుగుపెట్టి.

'నమస్కారం సార్ – తమరు పిలిచార్ట!' అన్నా ముఖాన్న చిరునవ్వు చిందించి 'ఆఁ – చూడు కామేశ్వర్రావ్ – రేపు 'అన్నపూర్ణ'లో మార్నింగ్ షో 'పంతాలూ –పట్టింపులూ' ఏ – కొత్త పిక్చర్లే దాని సాటిరావనుకో! యింటిదగ్గర ఆవిడా, పిల్లలు చాలా పట్టుదలగా, ఉన్నారు పిక్చర్ మిస్సవకూడదని నువ్వెలాగైనా సరే – ఆ 'షో'కి ఓ ఆరు టిక్కట్లు సంపాదించుకురావాలి' అంటూ ఓ యాభై నోటుని నాకందించారు పరాంకుశంగారు.

నా కసలు యిలాంటి పనులంటే చాలా చిరాకు అసలు మా ఆవిడ కూడా యిదే విషయంలో అప్పుడప్పుడు దెప్పుతోంటుంది నన్ను "మీకు ఆఫీసరే మొగుడు – ఆఫీసే యిల్లాలు. ఇంటిదగ్గర ఓ పెళ్లాంబిడ్డలు – మీ కోసం అలమటించే వాళ్ళు ఉన్నారన్న ధ్యాస ఉంటేగా! ఆ 'పాదసేవ' చేసుకోండి! – పైకొద్దురుగాని' అని." కానీ నాకు మాత్రం బాధగా ఉండదంటే? – ఏం చేసేది మరి??

జీవితంలో తొలిసారిగా నన్ను ఉద్యోగం వరించి ఆఫీసులో జాయినింగ్ రిపోర్టు యిచ్చిన రోజు సూపర్నెంటు గరుడాచారి గారిచ్చిన 'హితోపదేశాన్ని' మరిచిపోలేను.

"బాబూ! కామేశ్వర్రావూ ఆఫీసరు కోపంలో ఎప్పుడయినా ఏమన్నా అన్నాడే అనుకో – మనమే సర్దుకు పోవాలయ్యా. పంతాలకి పోయామో – 'ఏదో' ఆరిటాకు – ముల్లు' సామెతలా అవుతుంది మన జీవితం – అర్థమయిందా?

గరుడాచారిగారు కాలగర్భంలో కలిసిపోయినా నేను ఉద్యోగ రీత్యా ఈ ఇరవై ఏళ్లలో ఓ మెట్టు ఎక్కి యస్. ఏ.గా స్థిరపడినా, ఆయన 'సూక్తి ముక్తావళి' మాత్రం చెవులకు సోకుతూనే వుంది 'నిత్యమూను.

సంసార సాగరమయితే, ఉద్యోగానిది గుప్త సముద్రాల పరిమాణం! అందుకనే దాన్ని ఈదాలంటే ఓర్పు – నేర్పూ రెండూ వుండాలి. ఒడ్డు చేరడం గురించి బెంగపెట్టుకోకూడదు. ఎప్పుడూను!

సరే! అయ్యగారి ఆర్డరు ప్రకారం 'అన్నపూర్ణ' రిజర్వేషన్స్ కౌంటరులో నాకు తెలిసిన మన్మథరావుని కలిసాను మన్మథరావు అనాకారే అయినా మంచి మనసున్న మనిషి. ఫలితంగా, సునాయాసంగానే నా చేతిలో 'ఆరు' టిక్కెట్లు పెట్టాడు.

డి. యం. గారిల్లు ఎక్కడో గుట్టల బజార్లో. నేనుండేది మామిళ్ళగూడెం. మా ఆఫీసు వైరా రోడ్డులో "చందనా మేన్షన్స్" – వెంగళ్రావుగారి హయాంలో ఖమ్మం అలా అలా విస్తరించి పోయిందని చెబుతారు. డి. యం. గారింటి ముందర– గేటు తీసుకొని లోపల ప్రవేశించబోతూంటే "భౌ భౌ" మంటూ మీద కొచ్చింది వాళ్ళ ఆల్సేషియన్ కుక్క.

"ఏయ్– టామీ– యిలారా" అంటూ బయట కొచ్చిన డి. యం. గారమ్మాయి, నన్ను చూసి ఆగింది. టిక్కెట్లని ఆ అమ్మాయి కిచ్చి బయటపడదా మనుకొంటూంటే.

"ఒక్క నిముషం వెయిట్ చేయండి. మమ్మిని పిలుస్తాను" అంటూ లోపలకి తుర్రుమని పారిపోయింది. కాసేపటికి "అమ్మగారు" కాబోలు బయటికి వచ్చారు.

"నమస్కారమమ్మా! నేను కామేశ్వర్రావుని. అయ్యగారి ఆఫీసులో పనిచేస్తున్నాను. రేపు అన్నపూర్ణాలో మార్నింగ్‌షో "పంతాలు–పట్టింపులు"కి టికెట్లు కావాలన్నారు డి. యం. గారు. ఇవిగోనమ్మా" అంటూ, "సారు లేరామ్మా" అని అడిగాడు ముఖానికి పట్టిన చెమ్మని కర్చీఫుతో తుడుచుకొంటూ.

"లేరండీ– క్లబ్బు కెళ్ళారు" అని టిక్కెట్లందుకొని కాసేపాగి "చూడండి– ఇఫ్ యు డోంట్ మైండ్" అంటూ అర్థవంతంగా ఆగింది.

"మరేం ఫర్వాలేదు చెప్పండమ్మా!" అన్నా కొరిక తీర్చే భోళాశంకరుళ్ళా.

"ఏంలేదు. మా "టామీ"కి రెండు రోజులుగా స్టమక్ ట్రబులనుకుంటా. రాత్రిళ్ళు ఒకటే అరుపు. నిద్రపోనివ్వడం లేదు మమ్మల్ని. రేపుదయమే వచ్చి కాస్త దాన్ని వెటరినరి హాస్పటల్‌కి తీసుకు వెళ్ళి చెకప్ చేయించగలరా?" కంఠంలో అదారిటి ధ్వనిస్తోంది.

"ఓ! తప్పకుండానమ్మా! వస్తాను" అంటూ బయట పడ్డాను. మర్నాడు పూజకోసమని యింటావిడకి తెస్తానన్న పూలు వగయిరా, మా బాబికి ప్రామిస్ చేసిన డ్రాయింగ్ బుక్ తీసుకు వెళ్ళ లేకపోయాను. తొమ్మిది దాటితే షాపు లేముంటాయి? ఇక ఇంటి దగ్గర ఆ రాత్రి నాకు జరిగిన "మర్యాద" గురించి ప్రస్తావించకుండా వుంటేనే మంచిది!

మర్నాడు మళ్ళా మామూలే. శాంతియుత వాతావరణం నెలకొంది. యింట్లో– త్వరత్వరగా నాలుగు మెతుకులు కొరికి బయల్దేరి అమ్మగారి ఎసైన్‌మెంటు పూర్తి చేసుకొని ఆఫీసుకి చేరుకున్నా. "రేపు శనివారం– ఎల్లుండి ఆదివారం – రెండ్రోజులూ శెలవులే– ఫామిలీతో భద్రాచలం వెళ్ళాలి. సరదాగా అన్నీ చూసి రావాలి" అనుకొంటూ హుషారుగా పని చేసాను. సాయంత్రం ఐదవుతోందనగా "అయ్యగారు మీ కివ్వమన్నారు. అర్జంటు" అంటూ టెలిగ్రాం చేతులో కుక్కాడు అప్పలస్వామి. సోమవారం విశాఖపట్నంలో హెడ్డాఫీసులో డి. యం.ల కాన్ఫరెన్సనీ. అందు క్కావల్సిన మెటీరియల్‌తో మీటింగుకి సిద్ధమవమంటూ" అందులో సారాంశం.

బిల్లులూ– స్టేట్‌మెంట్లూ తయారు చెయ్యడమంటే కనీసం రెండు రోజుల పని". "హతవిధీ" అని నుదురు పట్టుకొని, నేను మొదటిసారిగా సర్వీసులో చేరిన దుర్ముహూర్తాన్ని తలచుకొని నన్ను నేను శపించుకున్నా. "భద్రాచలం రేపు వెళ్ళాలి, రెడీ అవండి!" అంటూ యింటి దగ్గర అందర్నీ సర్‌ప్రైజ్ చేద్దామనుకున్న నాకు (సారీ! నా ఆలో చనకి) పురిట్లోనే సంధి కొట్టింది.

పోన్లే! ఎదర దసరా పండగ లొస్తున్నాయిగా– అమ్మనీ, నాన్నని చూసి చాల కాలమయింది కూడా. వాళ్ళూ పెద్ద వాళ్ళయిపోయారు. ఒకసారి వచ్చి వెళ్ళమని నెల్లూరు నుంచి ఉత్తరాలపైన ఉత్తరాలు పిల్లల్ని కూడా తీసుకు వెళ్ళి వస్తే వాళ్ళకి ఆనందం– వీళ్ళకికాస్త రిలీఫ్. రెండు రోజులు సెలవుపెడితే చాలు. పది రోజులు కలిసొస్తాయి" అని ప్రస్తుతానికి సమాధాన పడ్డాను. ఈ సారయినా ముందుగా రిజర్వ్ చేయిం చేసుకొని లీవ్ లెటర్ పారేస్తే సరిపోతుంది.

మర్నాడు శనివారం. ఆఫీసుకొచ్చి కాన్ఫరెన్సు మెటీరియల్ తయారు చేసుకొంటున్నా. ఒంటి గంటయి పోయింది. పరాంకుశంగారు కూడా ఆఫీసు కొచ్చి కూర్చొని అంతఃక్రితమే వెళ్ళిపోయారు చెప్పకుండా. ఇంతలో టెలిఫోను మోగింది. వెళ్ళి రిసివర్ ఎత్తాను. ఫోనులో అవతల నుంచి ఖంగుమనే అమ్మగారి కంఠం.

"నమస్కారమమ్మా! నేను కామేశ్వర్రావుని. సార్ యిప్పుడే బయట కెళ్ళారు పనుందంటూ. ఎక్కడికి వెళ్ళారో చెప్పలేదమ్మా" ఏమన్నా చెప్పాలా ఆయన వస్తే?" అన్నా.

"అబ్బే ఏం లేదండీ. యిప్పుడే బాబు కాలేజి నుంచి ఫోను చేసాడు. అదేదో హాల్ టికెట్ విషయమై. వాళ్ళేదో పేచీ పెడుతున్నారని డాడీ ఉంటే పంపమనీ– ఆయన లేరంటున్నారు. వచ్చేటప్పటికి ఏ టయిమవుతుందో! మీరు ఏమనుకోనంటే ఓ

విషయం మీరోసారి వాడి కాలేజికి వెళ్ళి రాగలరా? అంటూ, "సారీ! పాపం మీకు చాలా ట్రబులిస్తున్నాను" అంది.

"అమ్మా!!"అని నేను మాట్లాడబోతూంటే అవతల నుంచి ఫోను పెట్టిన ధ్వని వినపడింది.

గవర్నమెంటు జూనియర్ కాలేజిలో మేనేజరు మా ఆవిడకి స్వయానా మేనమామ.

ఆయన ధర్మమా అని, వెళ్ళిన పని సానుకూలంగానే అయిపోయింది.


* * *

ఆరోజు అంతా చిదానందం తాండవిస్తోంది ఆఫీసులో. ఆ మర్నాటి నుంచే దసరా శెలవు లారంభం. మధ్యాహ్నం డి. యం. గారు ఒంట్లో నలతగా ఉందని శెలవు పెట్టేసారు. టైము ఐదవుతోంది.

'మీకు ఫోనంటే కామేశ్వర్రావు గారూ! డి. యం. గారు కాబోలు !' అంటూ వచ్చాడు మా కొలీగ్ చక్రధరరావు.

వెళ్ళి ఫోనందుకొని 'నమస్కారం ,సార్' కామేశ్వర్రావుని మాట్లాడు తున్నాను. అన్నా కాస్త అసహనంగానే, కీడుని శంకించి.

'నువ్వు రేపట్నుంచి లీవులో వెడుతున్నట్టున్నావు?!'



# ఈ వేమన పద్యాలు




సున్నమును దిన్నవానికి
నున్నతమగు స్వర్గమేల యుండదు చూడన్
వన్నెకు మించిన సున్నమె
యున్నతమగు బ్రహ్మమునకు నుపమగు వేమ.

'అవున్సార్! నెల్లూరు వెళ్ళాలి. రిజర్వేషను కూడా అయిపోయింది' అన్నా తిక్క కుదరాలని.

'సారి! కామేశ్వర్రావు! ఇప్పుడే జి. యం. గారు వైజాగ్ నుంచి ట్రంకాల్ చేసారు. రేపాయన కోణార్కలో వస్తున్నార్ట. వాళ్ళబ్బాయికి యిక్కడే తెలంగాణా పేపర్ బోర్డ్స్‌లో ఉద్యోగానికి ఇంటర్వ్యూట. రేపు, ఎల్లుండి ఉండి వెళ్ళిపోతార్ట. నీ జర్నీని కాస్త పోస్ట్ పోన్ చేసుకోందూ? అం- ఆయన్ని రేపు స్టేషన్లో రిసీవ్ చేసుకొని ఈ రెండురోజులు అయన వ్యవహారం చూసేసి తర్వాత లీవు ఎవైల్ చేసుకో! ఓ కే? అసలు నేనే స్టేషనుకి వెడదామనుకున్నా స్వయంగా కాని సమయానికి సిక్ అయిపోయాను". "కానీ! సార్ నేను....."

## పంతాలు పట్టింపులు

అంటూండగా ఫోను పెట్టేసాడాయన నిర్దాక్షిణ్యంగా.

చెప్పొద్దూ! నాకు ఒళ్ళుమండి పోయింది. ఇంతకాలం రెక్కలు ముక్కలు చేసుకొని పనిచేస్తూ, అవసరానికి నాలుగు రోజులు లీవ్ పెడ్తే- ప్రయాణాన్ని వాయిదా వేసుకోవాలంటాడూ? బోడి సలహా, వీడూను.'

ఏమయితే కానీ! చెప్పా పెట్టకుండా ప్రోగ్రాము ప్రకారం వెళ్ళిపోడానికే నిర్ణయించుకున్నాను. ఎందుకో గానీ యింటికి తాళం వేసి బయల్దేరుతూంటే ఎడమకన్ను అదిరింది.

దసరా అయి వచ్చాము. ఒళ్ళంతా బడలికగా వుండి ఆ పూట ఆఫీసుకి శెలవు పడేద్దామా అనుకొని- మళ్ళీ ఎందుకులే అని ఆఫీసుకి బయల్దేరాను. ఆఫీసుకి చేరేసరికి పదకొండు కొట్టింది.

"కామేశ్వర్రావ్గూ ! ఓసారి యిలా వస్తావూ? అంటూ పిలిచాడు సూపర్నెంటు మృదువుగా" డి. యం. గారు యిప్పుడే బయటికి వెళ్ళారు. నీగురించి అడిగారు కూడా. ఇదిగో! నీ ట్రాన్స్ఫర్ కాగితాలు. నిన్ను శ్రీకాకుళం వేశారు. నాకు ట్రాన్స్ఫరయినందుకు డి. యం. గారు కూడా చాలా బాధపడుతూ, చివరికి ఈ కాగితాలని నన్నే నీకివ్వమన్నారోయ్! వెరి సారీ! అంటూ సానుభూతి కురిపించి కాగితాలు నా చేతి కందించారు.

ఓహో! ఇది కూడా ఒక గుణపాఠమే కాబోలు నాలాంటి 'మెతక మనుషుల'కి . ఎక్కడో చదివినట్టు గుర్తు" మితి మీరిన మంచితనం కూడా ఒక అసమర్ధతే' అని కాగా- ఒక్క విషయం.

"పంతాలు-పట్టింపులు" సామాన్యమయిన ఉద్యోగులకు ఆరోగ్యకరమయిన లక్షణం కానేరదు. నాట్రాన్స్ఫర్ సంగతి గుప్పుమని ఆఫీసంతా వ్యాపించడానికి క్షణం కూడా పట్టలేదు. నిజానికి ఈ సంగతి నా కంటి ముందే వాళ్ళకు తెలిసి పోయింది కాబోలు నేను ఆఫీసులో అడుగు పెట్టే సరికి- అంతా నాకేసి 'అదోరకంగా' చూసారు ఆ చూపుల్లో సానుభూతి, జాలి, కరుణ సమ్మిళితమై ఉన్నాయి. కసాయివాడి కత్తివేటుకి బలవబోయే అమాయక ప్రాణి , అయిన గొర్రె పొట్టేలు కేసి చూసే చూపుల్లా ఉన్నాయవి.

"చూడు - కామేశ్వర్రావ్! జరిగిందానికి నువ్వేం బాధ పడకు.' అంతా మనమేలుకే అనుకొని సరిపెట్టు కోవడమే మంచి పని.' శ్రీకాకుళంలో అయితే చక్కగా కార్పొరేషన్ క్వార్టర్స్‌యిస్తుంది- ఈ ఖమ్మంలో లాగ- యిళ్ళద్దెలకి వేలకి వేలు పొయ్యక్కర్లేదు. అదీ ఒకందుకు మంచిదేలే" అంటూ సూపర్నెంటు ఓ దారుస్తూంటే, అందరూ నాకేసి సానునయంగా చూసారు.

అసలు తెరవెనక జరిగిన భాగోతం వేరే వుందని ఆ తర్వాతే నాకు తెలిసింది. 'కోణార్క'కి కూతుర్ని సికింద్రాబాద్ పంపిన అటెండర్ అప్పల స్వామికి రైలు దిగిన జి.యం. , ఆయన కొడుకూ ప్లాట్‌ఫారం పై కనబడ్డారని ముందుగా ఫోను చేసినా తన హెూదాకి తగినట్టు- ఎవరూ స్టేషను కొచ్చి రిసీవ్ చేసుకో పోవడంతో ఆగ్రహించిన జి. యం. గారు' ఇర్రెస్పాంసిబుల్ లాట్' అని చిరాకు పడ్డారని- ఈ విషయం ఆ తర్వాత డి. యం. గారి చెవిన పడిందని - ఆయనా - ఈయన చెవులు కొరుక్కొని తనని ' ఓ చూపు' చూసారని, ఫలితంగా పరాంకుశం గారు తనని 'అంకుశం పోటుతో ట్రాన్స్ఫర్ ఆర్డర్లిచ్చి సత్కరించారని తెలిసింది. జరిగిందానికి మనస్సు గాయపడినా - ముఖానికి చిరునవ్వు పులిమేసుకొని 'మీరనవసరంగా వర్రీ కాకండి సార్. ఐయామ్ ఆల్‌రైట్' అన్నాను సూపరింటెండెంటు గారితో - నా పాత్రను సక్రమంగా నిర్వహించానా, లేదా అన్న సందేహం మనసులో పీకు తూంటే. □